క్లుప్తంగా

అభివృద్ధి ప్రణాళికలు సక్రమంగా రూపొందించాలి

ఘంటసాల: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను సక్రమంగా రూపొందించుకొని అమలు చేయడం ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించవచ్చని ఎంపీడీవో డి.సుబ్బారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశంపై మండలంలోని గ్రామ సర్పంచులకు, మండల స్థాయి అధికారులకు, గ్రేడ్ 1–6 పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయాల సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. పలు అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు ఎంపీడీవో తెలిపారు. కోర్సు డైరెక్టర్‌గా ఎంపీడీవో డి.సుబ్బారావు, సహాయ కోర్సు డైరెక్టర్‌గా ఏపీఎం ఎం.పాండు రంగ ప్రసాద్ వ్యవహరించగా శిక్షకులుగా మండల అధికారులు వ్యవహరించారు.

పైడమ్మ జాతర ప్రశాంతంగా నిర్వహిద్దాం

డీఎస్పీ అబ్దుల్‌సుభాన్

పెడన: పైడమ్మ జాతర మహోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకుందామని, పట్టణ ప్రముఖులు, మత పెద్దలు, వివిధ సామాజిక సంఘాల నాయకులు సహకారాలను అందించాలని మచిలీపట్నం డీఎస్పీ అబ్దుల్ సుభాన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన గూడూరు రోడ్డులోని పెడన దేవాంగ కల్యాణ మండపంలో వివిధ శాఖల అధికారులు, వివిధ సామాజిక సంఘాల నాయకులు, మత పెద్దలు, దేవాలయాలకు చెందిన కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పైడమ్మ సంబరాలు శనివారం నుంచి ప్రారంభం కానుందని, ఆదివారం నుంచి జాతర ఉత్సవాలు ఊపందుకోనున్నాయన్నారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకోవడానికి శిడిబండ్లు కట్టుకుని మేళతాళాలతో మాత్రమే ఆలయానికి చేరుకోవాలన్నారు. డీజేలను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. అందరూ సమన్వయంతో నడుచుకోవాలని సూచించారు. తహసీల్దారు కె. అనిల్‌కుమార్, పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్, ఈవో టీవీవీ మోహనరావు, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, ఎస్‌ఐ– 2 రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కృత్తివెన్ను: మండలంలోని నీలిపూడి గ్రామంలో భక్తాంజనేయస్వామి ఆలయం 50వ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. 50 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు బుద్దన చిన్న, సుబ్బారావులతో పాటు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

- **భావదేవరపల్లి(నాగాయలంక):** హనుమత్ వ్రతం పర్వదినం పురస్కరించుకుని గ్రామంలోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా ప్రత్యేక వ్రత పూజ జరిగింది. ప్రధాన పీఠం వద్ద వరుల నాంచారయ్య ఆధ్వర్యంలో హనుమద్వ్రతం, ఆకుపూజ జరిపారు. స్థానిక శ్రీభావన్నారాయణ స్వామి దేవస్థానం వంశ పారంపర్య ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు– లక్ష్మి, అభయాంజనేయ ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మలిశెట్టి సాంబశివరావు– విజయలక్ష్మి, మాదివాడ సుధాకర్ దంపతులు పీటలపై కూర్చున్నారు. తొలుత అష్టోత్తరశత హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. మలిశెట్టి బాల ఆంజనేయులు, పలువురు గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.
- **బంటుమిల్లి:** మండల పరిధిలోని పలు ఆలయాల్లో శుక్రవారం హనుమద్వ్రతాలు భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. పాశ్చాపురం గ్రామంలో శ్రీ సువర్చలాంజనేయస్వామి ఆలయంలో ప్రధానమూర్తులకు లక్ష తమలపాకు పూజ పండితులు రొంపిచర్ల హనుమాంతాచార్యులు శిష్య బృందం వేదమంత్రాల మధ్య వైభవంగా నిర్వహించారు. జానకీరామపురం గ్రామంలోని శ్రీ వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో సువర్చలాంజనేస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగిశెట్టి దేవానంద్ దంపతులు దీక్ష ధారణలో పూజలు నిర్వహించారు.

సామూహిక కుంకుమార్చన

నాగాయితిప్ప(మోపిదేవి): మండలంలోని నాగాయితిప్ప గ్రామంలో శ్రీఅంకమ్మ అమ్మవారి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో గత 3 రోజుల నుంచి రామాయణం, భాగవతం, భగవద్గీత నుంచి ప్రవచనా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. చివరి రోజు శుక్రవారం 70 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. టీటీడీ కృష్ణాజిల్లా కో ఆర్డినేటర్ సీవీకే ప్రసాద్ నేతృత్వంలో టీటీడీ ధర్మాచార్యులు గరికిపాటి వీరాంజనేయులు పర్యవేక్షణలో నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగం బసవశంకరావు పాల్గొన్నారు.


రేపటి లోగా ఫసల్ బీమా ప్రీమియం చెల్లించండి

ఘంటసాల: పీఎం ఫసల్ బీమా యోజన పథకానికి ఈ నెల 15లోగా ప్రీమియం చెల్లించాలని ఏవో కే మురళీకృష్ణ తెలిపారు. రబీ 2024– 25 పంట కాలంలో మినుము, పెసలు, మొక్కజొన్న సాగు చేసే రైతులు దగ్గరలోని గ్రామ సచివాలయం, సీఎస్‌సీ సెంటర్లు, మీ సేవా కేంద్రాలకు వెళ్లి పట్టాదారు పాసుపుస్తకం, సీసీఆర్సీ (కౌలు రైతులు), ఆధార్, బ్యాంకు పాసుపుస్తకం, ఫోన్ నంబరు, సాగు ధృవీకరణ పత్రం అందజేయాలి. మినుము ఒక ఎకరానికి రూ.80, పెసలు ఎకరాకు రూ.36, మొక్కజొన్నకు రూ.84 చొప్పున ప్రీమియం మొత్తంగా చెల్లించాలి.

నగరంలో క్రిస్మస్ సందడి



స్టార్‌తో ప్రత్యేక అలంకరణలో పరాసుపేట ఆర్సీఎం చర్చి



ఐక్య క్రిస్మస్ వేడుకల సందర్భంగా ముస్తాబైన కోనేరుసెంటర్

- విద్యుద్దీపాలతో చర్చిలు, గృహాల అలంకరణ
- రంగు రంగుల స్టార్ల ఏర్పాటు
- ఐక్య క్రిస్మస్ వేడుకకు కోనేరుసెంటర్ ముస్తాబు

మచిలీపట్నంటౌన్: నగరంలో క్రిస్మస్ సందడి కనిపిస్తోంది. ఏ వీధి చూసినా క్రిస్మస్ స్టార్లు కనిపిస్తున్నాయి. ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకునేందుకు నగర ప్రజలు సంసిద్ధులయ్యారు. ఈ నెల 25వ తేదీన క్రిస్మస్ పండుగ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రోమన్ కథోలిక్ మిషన్‌కు చెందిన చర్చిల సంఘస్తులు నవంబర్ 25వ తేదీ నుంచే క్రిస్మస్ దినాలను ప్రారంభించారు. పలు సంఘాలకు చెందిన క్రైస్తవులు గత కొద్ది రోజులుగా ఉపవాస ప్రార్థనలు చేస్తున్నారు. సెమీ క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహిస్తున్నారు. క్రిస్మస్ పండుగ దగ్గర పడతుండటంతో నగరంలోని క్రైస్తవులు వారి గృహాలను రంగు రంగుల విద్యుద్దీపాలతో, నక్షత్రాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.



నోబుల్ చర్చి వద్ద ఏర్పాటు చేసిన స్టార్లు

అలాగే పలు ప్రాంతాల్లో ఉన్న చర్చిలను కూడా విద్యుద్దీపాలతో పాటు పెద్ద నక్షత్రాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

రేపు ఐక్య క్రిస్మస్ వేడుక..

ఈ నెల 15వ తేదీ సాయంత్రం మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల దైవసేవకుల సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక కోనేరుసెంటర్‌లో ఐక్య క్రిస్మస్ వేడుక నిర్వహించేందుకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా నగర నడిబొడ్డున కోనేరుసెంటర్‌ను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



ఆర్సీఎం చర్చి వద్ద ఏర్పాటు చేసిన స్టార్

రెవెన్యూ సదస్సులలో అర్జీల స్వీకరణ

పెడన: మండల పరిధిలోని చోడవరం, పుల్లపాడు గ్రామాల్లో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 19 అర్జీలు వచ్చాయని ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ తెలిపారు. చోడవరం గ్రామంలో జరిగిన సదస్సులో 8 అర్జీలు వచ్చాయని, ఇక్కడ రీసర్వే పూర్తికావడంతో ఆ సర్వేలో కొలతలు తేడాలున్నాయని, వారి దస్తావేజుల నకళ్లతో అర్జీలు సమర్పించారన్నారు. మధ్యాహ్నం పుల్లపాడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 11 అర్జీలు వచ్చాయని, ఇవి పాస్‌పుస్తకాలు, మ్యూటేషన్లకు సంబంధించి అర్జీలు ఇచ్చారన్నారు. ఈ సమావేశాలలో ఆర్‌ఐ విజయలక్ష్మి, స్థానిక గ్రామ పెద్దలు, సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

భావదేవరపల్లి(నాగాయలంక): మండలంలోని భావదేవరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మండల తహసీల్దార్ ఎం.హరనాథ్ ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై అధికారులతో చర్చించారు. భావదేవరపల్లిలో సదస్సులో 16 అర్జీలు అందినట్లు గ్రామ రెవెన్యూ అధికారి చెప్పారు. సర్పంచ్, ఉపసర్పంచ్‌లు మండలి ఉదయభాస్కర్, నల్లూరి శ్రీనివాసరావు, ఎంపీడీఓ జె.కె.సీతారామ్‌కుమార్, ఈఓపీఆర్‌డీ కె.అప్పలనరసమ్మ, గ్రామ రెవెన్యూ అధికారి భోగాది మల్లిక్, గ్రామ కార్యదర్శి సిబ్బంది, రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



చోడవరంలో సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దారు అనిల్‌కుమార్

మోపిదేవిలంక(మోపిదేవి): మండల పరిధిలోని మోపిదేవిలంక గ్రామంలో శుక్రువారం సర్పంచ్ మోర్ల జోత్స్న అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ద్వారా గ్రామస్తుల నుంచి సమస్యలపై పలు అర్జీలు అందినట్లు తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. కొత్త పాస్‌బుక్ రాలేదని, పాస్ బుక్‌పై డిజిటల్ సంతకం కాలేదని, ఎల్‌పీ నంబర్ కాలేదంటూ పలు అర్జీలు స్థానికుల నుంచి అందాయని తెలియజేశారు. మండల సర్వేయర్ రామకృష్ణబాబు, ఇన్‌చార్జి ఆర్‌ఐ మోపిదేవి శ్రీనివాసరావు, వీఆర్‌ఓ మోపిదేవి వెంకటేశ్వరావు, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని కంకటావ, ఆర్.వి.పల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలలో అర్జీలు వెల్లువెత్తాయి. తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో కంకటావలో నిర్వహించిన సదస్సులో 37 మంది రైతులు వినతిపత్రాలు సమర్పించారు. ఆర్.వి.పల్లిలో 10 మంది దరఖాస్తులు ఇచ్చారు. వీటిపై సమగ్ర విచారణ నిర్వహించి పరిష్కారం చూపిస్తామని తహసీల్దారు వెల్లడించారు. మండల సర్వేయరు మురళీకృష్ణ, ఆర్‌ఐ రాధ, ఆయా గ్రామాల సర్పంచులు మద్దాల వీర వెంకట మోహనరావు, రాజులపాటి రేణుకమ్మ, వీఆర్వో బషీర్, తదితరులు పాల్గొన్నారు.

కోడూరు: మండలంలోని ఉల్లిపాలెం పంచాయతీ వద్ద శుక్రవారం నిర్వహించిన రైతు సదస్సులో 38 అర్జీలు అందినట్లు తహసీల్దార్ శ్రీనునాయక్ తెలిపారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ సదస్సులు తోడ్పాటునిస్తాయని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలకు 29, భూ సర్వే కోసం ఒకటి, డీ-ఫామ్ కోసం ఎనిమిది అర్జీలు రైతులు ద్వారా అందినట్లు తహసీల్దార్ చెప్పారు. సర్పంచి వెర్రీ పావని, ఆర్‌ఐ సుభాషిణి, వీఆర్వో గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

కోడూరు: సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో 96 ప్రాదేశిక నియోజకవర్గాలు, ఎనిమిది నీటి వినియోగదారుల సంఘాలు శనివారం ఎన్నికల నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీను నాయక్ చెప్పారు. ఇందుకు సంబంధించి ఉదయం 9గంటల లోపు నామినేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని, సమయం దాటిన తరువాత నామినేషన్ వేయడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ప్రతి సంఘం కింద 12 మంది సభ్యులు పోటీ చేయవచ్చని, పోటీ చేసే ప్రతి ఒక్కరికి మద్దతుగా ఒకరు, సాక్షులుగా ఇద్దరు సంతకాలు పెట్టాల్సి ఉంటుందన్నరు. ఉదయం ప్రాదేశిక నియోజకవర్గాలకు, మధ్యాహ్నం నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యాక్షులు, బోర్డు ఎన్నిక ఉంటుందని తహసీల్దార్ చెప్పారు. ఎన్నికల సిబ్బంది ఉదయం 7గంటలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఏర్పాట్లు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల సామగ్రిని తహసీల్దార్ సిబ్బందికి అందించారు. డీటీ సౌజన్య కిరణ్మయి, ఆర్‌ఐ సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంక: మండల పరిధిలోని 12 నీటి సంఘాల ఎన్నికలు నిర్వహణ ఏర్పాట్లపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు, పీఓలకు తహసీల్దార్ ఎం.హరనాథ్ అధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మడలంలో 9 నీటి సంఘాల పరిధిలో మొత్తం 108 టీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి రైతుల ఓటర్ల జాబితాలు, విధులు, తదితర అంశాలపై సిబ్బందికి తహసీల్దార్ దిశానిర్దేశం చేసారు. తొమ్మిది నీటి సంఘాల పరిధిలో 11,460 మంది ఓటర్లులో పురుషులు 7,520 మంది, స్త్రీలు 3,940 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. తొమ్మిది మంది ఎన్నికల అధికారులను, టీసీలకు 216 మంది సిబ్బందిని నియమించారు. ఉదయం గం.8 నుంచి గం.12 వరకు టీసీలకు మధ్యాహ్నం 3గంటల నుంచి సాగునీటి వినియోగదారుల సంఘాల (డబ్ల్యుయూఏ) అధ్యక్షుల ఎన్నిక జరుగుతుంది. ఇరిగేషన్ ఏఈ పొన్నూరు రవితేజ, ఎంపీడీఓ జేకే సీతారామ్‌కుమార్, డీటీ అబ్దుల్ రఫీ, ఎంఈఓ అన్నపరెడ్డి రామారావు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ హరనాథ్, ఇతర అధికారులు

నేడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు

కృత్తివెన్ను: మండల పరిధిలోని ఎనిమిది నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరగనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందని 9 నుంచి ఒంటి గంట మధ్య టీసీ ఎన్నికలు, 3 గంటల నుంచి 5 గంటల మధ్య నీటి సంఘాల అధ్యక్షుల ఎన్నికలు పూర్తికానున్నట్లు వివరించారు. 17న డీసీ ఎన్నికలు జరుగుతాయన్నారు. మండలంలో చినపాండ్రాక, మునిపెడ, నీలిపూడి, కొమాళ్లపూడి, కృత్తివెన్ను, గరిశపూడి, చందాల, లక్ష్మీపురం సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి.

ఘంటసాల: సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను వీఆర్వోలు సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ బి.విజయ్ ప్రసాద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. శనివారం చిట్టూరు, లంకపల్లి, శ్రీకాకుళం, ఘంటసాల నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ఆయా గ్రామాల్లోని జెడ్పీ హైస్కూల్స్‌లోను, పాపవినాశనం, చిట్టూర్పు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ఆయా గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగుతాయన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను కల్పించాలని చెప్పారు. ఓటు వేసే వారు తమ పేర్లు టీసీ ఓటరు జాబితాలో నమోదై ఉండాలని, రైతు పట్టాదారు పాస్ పుస్తకం, వీఆర్‌వో జారీ చేసిన ఏదైన గుర్తింపు పత్రాలతో పాటు ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు. ఓట వేసే వారు ఉదయం 8 గంటల కల్లా పోలింగ్ కేంద్రాలకు రావాలని, 9 గంటలు దాటితే ఓటర్ను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించవద్దని అధికారులకు సూచించారు. డెప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, సర్వేయర్ డీటీ పి.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ వల్లీపుష్ప, వీఆర్వోలు పాల్గొన్నారు.

గూడూరు: సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి తెలిపారు. ముక్కొల్లు, తరకటూరు, కంచాకోడూరు, మల్లవోలు, కోకనారాయణపాలెం, గూడూరు, సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరగున్నాయని వెల్లడించారు. ముక్కొల్లు, తరకటూరు సాగునీటి సంఘం ఎన్నికలను స్థానిక జెడ్పీ హైస్కూళ్లలో నిర్వహిస్తుండగా, కంచాకోడూరు సాగునీటి సంఘం ఎన్నిక రాయవరం జెడ్పీ హైస్కూలులోను, మల్లవోలు సాగునీటి సంఘం ఎన్నిక పంచాయతీ కార్యాలయంలోను, కోకనారాయణపాలెం సాగునీటి సంఘం ఎన్నిక స్థానిక రైతు సేవా కేంద్రంలోను, గూడూరు పంచాయతీ కార్యాలయంలోను నిర్వహిస్తున్నామని తహసీల్దారు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాగాయలంక: మండలంలోని ఏటిమొగ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని తీర గ్రామాల్లో శనివారం కరెంటు నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఉయ్యూరు సెక్షన్ ఈఈ డి.కృష్ణనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటిమొగ సబ్ స్టేషన్ కింద 33 కేవీ లైన్స్‌పై విద్యుత్ తీగలకు ఆటంకం కలిగిస్తున్న చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనులు చేపట్టనున్నందున ఉదయం గం.8 నుంచి గం.11.00 వరకు ఏటిమొగ, చినకమ్మ వారిపాలెం, గుల్లలమోద, పెదకమ్మవారిపాలెం, పెద పాలెం, ఎదురుమొండి, నాచుగుంట, జింకపాలెం తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అవనిగడ్డ: మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఉయ్యూరు డివిజన్ డీఈఈ డి. కృష్ణనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత సబ్ స్టేషన్ పరిధిలోని అవనిగడ్డ గ్రామంలోని కొంతమేర, పులిగడ్డ, మోదుమూడి, అశ్వరావుపాలెం, రామచంద్రపురం, దక్షిణ చిరువోలులంక, నాగాయలంక రోడ్‌లోని కొత్త సబ్ స్టేషన్ పరిధిలో అవనిగడ్డ గ్రామంలో కొంతమేర విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

కృత్తివెన్ను: మండల పరిధిలోని కృత్తివెన్ను విద్యుత్ సబ్ స్టేషన్ ఫీడర్‌కు మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు కృత్తివెన్ను, లక్ష్మీపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈఈ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాలన్నారు.

బాల్యవివాహాలను అరికడదాం

కోనేరుసెంటర్: బాల్య వివాహాలు, మహిళల అక్రమ రవాణాను అరికట్టటంలో అందరూ భాగస్వాములు కావాలని సీడీపీవో కే గ్లోరీ పిలుపునిచ్చారు. కిశోర వికాసం కార్యక్రమంపై మండలంలోని పలు విభాగాల సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లైంగిక వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మనతో పాటు బాలికలకు లైంగికవేధింపులు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కలిగిస్తూ ఉండాలన్నారు. గ్రామస్థాయిలో అధికారులకు శిక్షణ తీసుకోవాలన్నారు. సంపూర్ణ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల కూడా వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చు అని అన్నారు. ఈవోపీఆర్డీ బాలకృష్ణ, ఏపీఎం సత్యనారాయణ, యోగ మాస్టర్ మల్లికార్జునరావు పోలీస్‌శాఖ తరపున శక్తి టీం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. గ్రామ స్థాయిలో ఉన్న వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు హై స్కూల్ ఉపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యకర్తలు, సెక్టార్ సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, విజయకుమారి, లక్ష్మీమాలతి, దేవి పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

రూ.7 లక్షలు అపరాదరుసుం వసూలు

పెడన: విద్యుత్‌శాఖ అధికారులు పట్టణం, మండలంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. మచిలీపట్నం విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు, ఆపరేషన్ ఈఈ జీబీ శ్రీనివాసరావుల నేతృత్వంలో మచిలీపట్నం, పెడన, పామర్రు డీఈఈలు, ఏఈలు, లైన్‌మెన్లు ఈ దాడుల్లో పాల్గొన్నారు. 2013 గృహ సర్వీసులను, 179 వాణిజ్య సర్వీసులను, 16 ఇతర సర్వీసులను పరిశీలించారు. మొత్తం 2,208 విద్యుత్ సర్వీసులను పరిశీలించగా 214 సర్వీసులకు అదనపు లోడు 309 కిలోవాట్స్‌కు సంబంధించి రూ.7,06,800 అపరాధ రుసుం కింద వసూళ్లు చేశామని పెడన విద్యుత్‌శాఖ ఏడీఈ సీహెచ్ మాణిక్యలరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగితే 94408 12091, 94408 12363లకు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడులకు ముందు బంటుమిల్లి రోడ్డులోని పెడన ఫంక్షన్ హాలులో విద్యుత్ సిబ్బందికి దాడులపై దిశానిర్దేశం చేశారు. ఎవరు ఎటువైపు దాడులకు వెళ్లాలో తెలియజేయడంతో పాటు బృందాలను గైడ్ చేసేలా దాడులు నిర్వహించామని ఏఈడీ మాణిక్యలరావు తెలిపారు.



విద్యుత్ సర్వీసుల పరిశీలన, దాడులపై దిశానిర్దేశం చేస్తున్న విద్యుత్‌శాఖాధికారులు

పీఎఫ్ సొమ్ము జమ కోరుతూ కార్మికుల ధర్నా

- 17 నుంచి నిరవధిక సమ్మెకు నిర్ణయం
- రూ.1.57 కోట్ల బకాయి జమ కోసం డిమాండ్

మచిలీపట్నంటౌన్: ప్రభుత్వ జిల్లా సర్వజన ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు తమకు 2021 నుంచి 2024 సంవత్సరాల మధ్య నాలుగేళ్లుగా ఇవ్వాల్సిన ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్‌ఐ సొమ్మును జమ చేయాలని కోరుతూ శుక్రవారం ఆస్పత్రి ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఆస్పత్రిలోని అత్యవసర విభాగం వద్ద ధర్నా చేసి డిమాండ్‌లతో కూడిన నినాదాలు చేశారు. పారిశుధ్య కాంట్రాక్టు సంస్థ అయిన ఫస్ట్ ఆబ్జెక్ట్ ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ గత నాలుగేళ్లుగా తమ జీతాల నుంచి మినహాయించిన సుమారు రూ.1.57 కోట్లను తమ ఖాతాలకు జమ చేయాలనే డిమాండ్‌తో నిరసనకు శ్రీకారం చుట్టారు. ఇటీవల కొద్ది నెలల క్రితం ఈ సొమ్మును జమ చేస్తానని అధికారుల సమక్షంలో హామీ ఇచ్చిన కాంట్రాక్టర్ హామీని విస్మరించి దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నాడని కార్మికులు ఆరోపించారు. తమ జీతాల నుంచి మినహాయించిన ఈ సొమ్మును చెల్లించకుంటే ఈ నెల 17వ తేదీ వరకూ నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతామన్నారు. ఆ తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళతామని కార్మికులు హెచ్చరిస్తున్నారు.

వెంకటాచలుడికి నూతన శిఖర శోభ

- రూ.30 లక్షలతో రాజగోపురం నిర్మాణం
- నేడు రాజగోపుర శిఖరం ప్రారంభం

గూడూరు: స్థానిక దేవి భూదేవి సమేత శ్రీ వెంకటాచలస్వామి ఆలయం శిఖర శోభను సంతరించుకుంది. వెంకటాచలస్వామి ఆలయానికి ఎంతో ఘన చరిత్ర కలిగి ఉంది. అలాంటి ఆలయానికి రాజగోపురం లేకపోవడం లోటుగా ఉండేది. ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేసిన గత ప్రభుత్వం చొరవతో ఆలయానికి రాజగోపురం లోటు తీరింది.

రూ.30 లక్షలతో అభివృద్ధి..

అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సాగిన గత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రూ.30 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ నిధుల నుంచి రూ.6 లక్షలు, దాతల సహకారంతో రూ.4 లక్షలు వెరసి రూ.10 లక్షలు కంట్రిబ్యూషన్ జమచేయగా.. నాటి జగనన్న ప్రభుత్వం కామన్‌గుడ్ ఫండ్ ద్వారా రూ.20 లక్షలు మంజూరు చేసింది. దీంతో రూ.30 లక్షలతో ఆలయానికి రాజగోపురం, శిథిలమైన యాగశాల పునర్నిర్మాణ పనులు చేపట్టారు.

వేగంగా నిర్మాణ పనులు..

గత ఏడాది ఆగస్టు 23న భూమి పూజతో ప్రారంభమైన రాజగోపుర శిఖర నిర్మాణ పనులు శరవేగంగా పూర్తయ్యాయి. రాజమండ్రికి చెందిన శిల్పులు రాజగోపుర శిఖరంపై రూపొందించిన శిల్పాలు ఆకట్టుకుంటున్నాయి. వీటికి కాకినాడకు చెందిన చిత్రకారులు దిద్దుతున్న రంగులు మరింత శోభను ఇనుమడింప చేస్తున్నాయి.



గూడూరులో పునర్నిర్మించిన రాజగోపుర శిఖరం

గోదాలక్ష్మి విగ్రహ ప్రతిష్ట..

ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులతో పాటుగా గోదాలక్ష్మి విగ్రహ ప్రతిష్ట కూడా జరుగనుంది. ఆలయంలో గోదాలక్ష్మి విగ్రహ ప్రతిష్ట కోసం కేటాయించిన గదిని పూర్తిస్థాయిలో ఆధునీకరించారు.

ఘనంగా ప్రారంభ మహోత్సవాలు..



టి.వి.వి.మోహనరావు, ఆలయ కార్యనిర్వహణ అధికారి

శనివారం ఉదయం 8.19 గంటలకు ఆలయ రాజగోపుర శిఖర ప్రారంభంతో పాటు గోదాదేవి విగ్రహ ప్రతిష్ట కూడా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.వి.వి.మోహనరావు తెలిపారు. గురువారం ప్రారంభమైన ప్రారంభమహోత్సవాలు శనివారంతో ముగుస్తాయి. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

మోపిదేవి: ఏసుక్రీస్తు బోధనలు సమాజ సేవా భావాన్ని నింపుతాయని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అన్నారు. మోపిదేవిలో శుక్రవారం సెమీ క్రిస్టమస్ వేడుకలు మండల స్థాయిలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు అందజేశారు. ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అంతకు ముందు ఆట-పాటలతో ప్రభుబోధకులు క్రీస్తు సందేశాన్ని అందించారు. గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి, జెడ్పీటీసీ మెడబలిమి మల్లిఖార్జునరావు, గ్రామ మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, నందిగం అభిషేకరావు, ప్రభు బోధకులు, సేవకులు పాల్గొన్నారు.

సీపీఎం సభలు విజయవంతం చేయండి

ఘంటసాలపాలెం(ఘంటసాల): ఈ నెల 15వ తేదీ నుంచి జరిగే సీపీఎం పార్టీ కృష్ణా జిల్లా 25వ మహాసభలు విజయవంతం చేయాలని సీపీఎం నేత వాకా రామచంద్రరావు పిలుపునిచ్చారు. చల్లపల్లిలో సీపీఎం జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ ఘంటసాల పాలెంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 15,16,17 తేదీల్లో జరిగే జిల్లా మహాసభలకు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులురాలు కామ్రేడ్ సుంకర పుణ్యవతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, పలు సంఘాల జిల్లా, మండలనేతలు పాల్గొంటారని రామచంద్రరావు తెలిపారు.

పెన్షనర్ల కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

బంటుమిల్లి: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో శుక్రవారం పెన్షనర్స్ బంటుమిల్లి తాలూకా (బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలు) కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ నెల 17వ తేదీన జరగనున్న పెన్షనర్స్ డేను పురస్కరించుకుని తాలూకా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడు చండిక గంగాజలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బంటుమిల్లి సబ్ ట్రెజరీ అధికారి(ఎస్‌టీఓ) గోపీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని పెన్షనర్స్‌కు ప్రభుత్వ సేవలను వివరించారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా గంగాజలరావు, కార్యదర్శిగా భాస్కరరావు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులు ఎస్‌టీఓను సన్మానించారు. పలువురు విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాల విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.